# 'రాయి' తీ

స్థలం: విజయనగరంలోని బొంకులదిబ్బ.

రేడియోలు, సినిమాలు అనే మాటల్లో రేడియో, సినిమా అనే మాటలు ఇంగ్లీషువి. లు అనేది బహువచనాన్ని సూచించే తెలుగక్షరం. అలాగే సైన్యానికి నిలయమైన బంకు (Bunk) అనే ఇంగ్లీషు మాటకి 'లు' చేర్చేసి బంకులు చేసేసి క్రమేణ బంకుల దిబ్బ బొంకుల దిబ్బ అనే వ్యవ హారంలోకి వచ్చేసింది. కన్యాశుల్కంలోని గిరీశం కూడా ఈ బొంకులదిబ్బని ప్రస్తావించాడు. ఈ బొంకులదిబ్బమీద అనేక రకాలైన తాజా కూరగాయలు అమ్ముతారు.

బొంకులదిబ్బమీదఅమ్మే మాంఛి ముళ్ల వంకాయలు తెమ్మని ముద్దుకృష్ణకి పురమాయించింది వాళ్లావిడ.

రెడ్డిపల్లి వంకాయలు, రెల్లివలస వంకాయలు గుట్టలు గుట్టలుగా పడివున్నాయి. దాంతో పోటీఎక్కువైంది.

"కేజి వంకాయలు మూడ్రూపాయలు! తాజా వంకాయలు మూడ్రూపాయలు! రండి బాబూ రండి!" అని అరుస్తున్నాడు ఓ వర్తకుడు. ముద్దుకృష్ణ ఆ దెసగా వెళ్లబోయాడు.

"అవేం వంకాయలండీ పుచ్చివంకాయలు! నా కాడకి రండి బాబూ నాణ్యమైన వంకాయలిస్తాను!" అన్నాడింకో వర్తకుడు. ముద్దుకృష్ణ అటువైపు మళ్లేడు.

"బాబూ! ఆడికాడ కెళ్లేరంటే తూకంలో మస్కా కొట్టేస్తాడు. నాను రెండు కేజీలూ ఐదు రూపాలకిస్తాను!" అన్నాడుమరొకడు.

పోనీ రెండుకేజీల దగ్గరా ఓ రూపాయి కలిసొస్తుంది కదా, ఆరూపాయితోను పావలా కొత్తిమీరి, పావలా కరివేపాకు, అర్ధరూపాయి పచ్చిమిరపకాయలు కొనుక్కోవచ్చని ఆ దిశగా వేళ్ళేడు ముద్దుకృష్ణ.

"బాబయ్యా! నాకాడ కొన్నారంటే ఇంకా రాయితీలిస్తాను. రెండు కేజీల

కైదురూపాయలు, మూడు కేజీలకి నాల్రూపాయలు. ఇలా ఎక్కువకొన్న ప్రతీ కేజీకి రూపాయి చొప్పున రాయితీ, ఇచ్చుకుంటూపోతాను. రండిబాబు!" అని ఆహ్వానించాడింకో వర్తకుడు.

"భలే మంచి చౌక బేరము" అనుకుంటూ ముద్దుకృష్ణ అటువైపు మళ్ళేడు.

"అయితే ఏవిటోయ్! కేజీకి రూపాయి తగ్గించుకుంటూ పోతావా? మాట మీదనిలబడాలిస్మీ!" అన్నాడు ముద్దుకృష్ణ.

"మాటంటే మాటే బాబూ! తిరుగునేదు" అన్నాడు వర్తకుడు.

"అయితే ఏడు కేజీల వంకాయలు పడీవోయ్!" అని సంచీ చూపించేడు ముద్దుకృష్ణ.

వర్తకుడు వంకాయలు పడేసి డబ్బులకోసం చెయ్యి చాచేడు.

"నీకు నేనేమీ ఇవ్వక్కర్లేదోయ్!" అన్నాడు ముద్దుకృష్ణ.

"అదేటి బాబయ్యా అలాగంటారు? డబ్బుల్లేకుండా వేపారం ఎలాగవుతాది?"

"చూడు నాయనా? ఎక్కువకొన్న ప్రతి కిలోకి రూపాయి రాయితీ ఇస్తానన్నావా? రెండు కేజీలకి ఐదురూపాయలు, మూడు కేజీలకి నాలుగు రూపాయలు, నాలుగు కేజీలకి మూడు రూపాయలు, ఐదు కేజీలకి రెండు రూపాయలు, ఆరు కేజీలకి రూపాయి, ఏడు కేజీలకి ఏవీ ఇవ్వక్కర్లేదన్నమాట!" అన్నాడు ముద్దుకృష్ణ.

"అరే! నేనిచ్చిన రాయితీ నాబుర్రమీదే రాయిలా తగిలి, బుర్ర బొడిపి కట్టిందే?" అనుకున్నాడు వర్తకుడు.

25-1-1989

ఆంధ్రభూమి దినపత్రిక